క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడిగా అనిల్



జనగామ రూరల్: ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడిగా ఇనుముల అనిల్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఏడేళ్ల నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు అనిల్ పేర్కొన్నారు.

చేయూత



లింగాలఘణపురం: నెల్లుట్లకు చెందిన పేద కుటుంబమైన నానపురం రేణుక ఉపాధికి జబర్దస్త్ ఆర్టిస్టులు నూకరాజు, ఆసియా గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. రేణుకకు ముగ్గురు పిల్లలు ఉండగా భర్త వదిలేసి వెళ్లిపోవడంతో ఆ కుటుంబ పోషణ ఆమెకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో నెల్లుట్లకు చెందిన నల్ల సుధీర్ ఆ కుటుంబ పరిస్థితిని జబర్దస్త్ ఆర్టిస్ట్ నూకరాజుకు వివరించగా ఉపాధి కోసం ఏదైన సహాయం చేస్తామని చెప్పారు. వీధివీధి తిరిగి కూరగాయాలు అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకొనేందుకు నాలుగు చక్రాల బండిని కొనుగోలు చేసుకుంటామని రేణుక చెప్పగా ఆర్థిక సహాయం అందించి బండిని కొనుగోలు చేసి ఇచ్చారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి సహాయం చేసిన నూకరాజు, ఆసియాకు రుణపడి ఉంటానని, అందుకు సహకరించిన నల్ల సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నల్ల రాహుల్, బొట్ల రవి, విజయ్, విల్సన్, సంపత్, కరుణాకర్, కమల్ ఉన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథం అందజేత

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో ప్రబోధసేవా సమితి జనగామ కమిటీ సభ్యుడు కొన్నె ఉపేందర్ ఆధ్వర్యంలో గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ తరంగాలు అనే గ్రంథాన్ని జబర్దస్ ఆర్టిస్టులు నూకరాజు, ఆసియాలకు అందజేశారు.

విజయవంతం చేయాలి



జనగామ రూరల్: ఈనెల 5 తేదిన హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి అన్నారు. ఈ మేరకు గురువారం పెంబర్తిలో విశ్వకర్మ బ్రాస్ కాపర్, సిల్వర్ ఇండస్ట్రియల్ కో ఆపరేటీవ్ సొసైటీ ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట అధ్యక్షుడు రంగు లక్ష్మణాచారి, సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి రంగు నర్సింహాచారి, జిల్లా మహిళ నాయకురాలు మద్దోజు గంగాభవాని, రాజు, బచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

జఫర్‌గఢ్: కోతిని తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘనటలో పలువురు గాయపడిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉదయం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హనుమకొండలోని తన నివాసంలో కలిసేందుకు ఆటోలో వెళ్లారు. అక్కడ శ్రీహరిని కలిసిన తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో జఫర్‌గఢ్ ప్రధాన రహదారిలో ఒక్క సారిగా ఎదురుగా వచ్చిన కోతిని తప్పించడంతో ఆటో అదుపు తప్పి బొల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు కోడిమాల రాజు కాలు విరగగా, కూస శ్రీను, యాకనాథం, సత్తయ్య తదితరులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, కాలు విరిగిన రాజు వరంగల్ లోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అయ్యప్ప దేవాలయంలో చోరీ

జనగామ రూరల్: పట్టణంలోని బాణపురం అయ్యప్ప దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. బీరువాలో దాచిన రెండు వెండి కలశం చెంబులు, అమ్మవారి పుస్తె మట్టెలు, అయ్యప్ప స్వామి రెండు వెండి తిలకములు, అమ్మవారి వెండి కిరీటం, నాగపడిగెలు, రూ.9,300 నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం అరకిలో వెండి, అర్ధతులం బంగారం చోరీచేశారని, వాటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు



తరిగొప్పుల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహ్మద్ ముజామిల్



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో.. డీపీఎం అనిల్‌కుమార్

తరిగొప్పుల: గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహ్మద్ ముజామిల్ అన్నారు. మండలకేంద్రంతో పాటు బొత్తలపర్రె, అంకుషాపూర్, సోలిపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఏఈఓ జయశ్రీ, పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య, మల్లయ్య, శివ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, జాఫర్‌గూడెం, గోవర్ధనగిరి, రఘునాథపల్లి, వెల్ది, ఖాంజీపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా ప్రాజెక్ట్ అధికారి (డీపీఎం) కందుల అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాల ద్వారా 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏపీఎం సారయ్య, సీసీలు భాగ్యలక్ష్మి, రీనావతి, ఉమ, ఎల్లస్వామి , ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

శాతపురంలో..

పాలకుర్తి: శాతపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సొసైటీ సీఈఓ రణధీర్, ఏఈఓ పెద్దూరి శ్రావణి ప్రారంభించారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

లింగాలఘణపురం: పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ రాజేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని క్లాం సొసైటీలో ఆయన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఏఆర్ శంకర్‌నాయక్, ఏఈఓ వెన్నెల, సీఈఓ మల్లేశం తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

● బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎల్లంలలో నేతన్నతో మాట్లాడుతున్న పల్లా

జనగామ రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెసోళ్ల కట్టు కథలు నమ్మొద్దు.. గ్రామాల్లో కనిపిస్తున్న అభివృద్ధికి పట్టం కట్టాలని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి పెంబర్తి, ఎల్లంల, సిద్దెంకి, పెద్దరాంచర్ల, ఓబుల్‌కేశ్వాపూర్, పసరమడ్ల, శామీర్‌పేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు 24 గంటల విద్యుత్, పెట్టుబడి సాయం, పంటపొలాల వద్దే కొనుగోళ్లు చేపట్టి ఏళ్ల తరబడి అన్నదాత పడిన గోసను దూరం చేశామని చెప్పారు. తాగు నీరు లేక అల్లాడిన జనగామ నేడు గోదావరి జలాలతో సస్యశ్యామలంగా మారిందన్నారు. తెలంగాణ సర్కారు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలను ఆదుకుంటుంటే.. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఇవన్నీ అమలు చేయలేక ఉచితాలు బంద్ చేయాలనడం సరికాదన్నారు. 'జనగామను మరింత అభివృద్ధి చేసే బాధ్యత నాదే.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటనీ ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తా.. పెంబర్తిని పర్యాటక కేంద్రంగా మార్చుతూ పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తామని' అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రాజయ్య, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, బైరగోని యాదగిరి, ఎంపీపీ మేకల కళింగ రాజు, మార్కెట్ చైర్మన్ సిద్ధిలింగం, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, ఎంపీపీ కళింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ పట్టణం 17 వార్డులో ఏళ్ల తరబడి ఉన్న గోడ సమస్య పరిష్కరించాలని వార్డు సభ్యులు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. హామీ ఇచ్చారు. ప్రేమలతారెడ్డి, వెంకటేశ్వర్లు, గణేష్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహాచారి, చంద్రయ్య, నర్సయ్య, శ్రీరాములు, మణిరాజ్ పాల్గొన్నారు.

దళితుల జీవితాల్లో వెలుగు నింపిన కేసీఆర్

బచ్చన్నపేట: దళితుల కుటుంబాల్లో ముఖ్య మంత్రి కేసీఆర్ వెలుగులు నింపారని, అలాంటి నాయకత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నామని బేడ బుడిగ జంగాల జేఏసీ రాష్ట వైస్ చైర్మన్ చింతల యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని గోపాల్‌నగర్‌లో బేడ బుడిగ జంగాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో దళితులకు గుర్తింపు లభించినదని బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. మండల అధ్యక్షుడు సిరిపాటి రాందాస్, జిల్లా యూత్ అధ్యక్షుడు చింతల కరుణాకర్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు చింతల మధుకృష్ణ, నాయకులు తూర్పాటి యాదగిరి, ఉప్పలయ్య, విజయ్, చింతల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: పల్లగుట్టకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు వేల్పుల గట్టయ్య తండ్రి కొమురయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా, గురువారం ఏర్పాటు చేసిన సంతాప సభకు శ్రీధర్ రావు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైస్ ఎంపీపీ భూక్య సరితనరసింహ ఎంపీటీసీలు ఝాన్సి, యాదగిరి, మాలోతు రమేష్‌నాయక్, సర్పంచ్ మానసతోపాటు తదితరులు ఉన్నారు.

ఇటుకాలపల్లిలో..

బచ్చన్నపేట: ఇటుకాలపల్లిలో కొలుగూరి రామచంద్రయ్య మృతి చెందారు. కాగా, గురువారం బాధిత కుటుంబీకులను మాజీ సర్పంచ్ ఆకుల నాగయ్య పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మ్యాక కిష్టయ్య, రాగుల మల్లారెడ్డి, బైరగోని కనుకయ్య, పాల నర్సింహులు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: జనగామ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొ మ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బచ్చనపేట మండలం లింగలపల్లి, నర్మెట మండలం, జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్‌కు చెందిన సుమారు 200 మంది కాంగ్రెస్‌లో చేరగా, కొమ్మూరి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. నాయకులు ధర్మ గోవర్ధన్‌రెడ్డి, బడికే కృష్ణ స్వా మి, జనార్దన్‌రెడ్డి, మల్లారెడ్డి, సుదర్శన్, భూపాల్ రెడ్డి, అనిల్, అంజిరెడ్డి, త దితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీయే లక్ష్యం



కొడకండ్ల: మంత్రి సమక్షంలో చేరిన యువకులు

పాలకుర్తి: భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు కోరారు. గురువారం మండలంలోని మల్లంపల్లిలో ఇంటింటికి వెళ్లి ఎర్రబెల్లిని గెలిపించాలని విస్తృత ప్రచారం చేపట్టారు. పుల్లూరి అశోక్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, పోశాలు వెంకన్న, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ గర్వందుల మల్లేశం, సర్పంచ్ వాలునాయక్, ఎంపీటీసీ గుగులోత్ వసంత, రఘుపాల్ రెడ్డి పాల్గొన్నారు.

హరీశ్‌కు తగిన గుర్తింపు ఉంటుంది..

తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కేసుల పాలైన జేడీ హరీశ్ బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయమని మంత్రి దయాకర్‌రావు అన్నారు. గురువారం ఆయనకు పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

కొడకండ్ల: మండలంలోని చెరువుముందు తండాకు చెందిన యువసేన యూత్ సభ్యులు యాకు, సుమన్, కిరణ్, రవి, సుధాకర్‌ల ఆధ్వర్యంలో యువకులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

ఇంటింటా సంక్షేమ పథకాలను వివరించాలి

బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించి దయాకర్‌రావు గెలుపునకు యువజన నాయకులు సైనికుల్లా పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మండల ఇన్‌చార్జ్ భానుకిరణ్‌లు కోరారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన యూత్ విభాగం సమావేశంలో వారు మాట్లాడారు.

కోతుల నియంత్రణకు చర్యలు



కోతులను పట్టిస్తున్న సోమసుందర్

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, రియల్టర్ ఏల సోమసుందర్ ఆధ్వర్యంలో కోతుల నియంత్రణకు చర్యలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని కామారెడ్డి గూడెంలో కోతులను పట్టే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలను పట్టిపీడిస్తున్న తీవ్రసమస్య కోతులను నియంత్రించేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచన మేరకు శ్రీకారం చుట్టామన్నారు. పట్టించిన కోతులను సురక్షితంగా ఏటూరునాగారం అడవుల్లో వదిలేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ జాకిర్, మాజీ సర్పంచ్ చింత సోమయ్య, బీఆర్‌ఎస్ మండల నాయకుడు బిల్లా యాదవరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎల్లబోయిన గిరి యాదవ్ తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్‌గా రాధ



రాధకు స్వీట్ తినిపిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్‌పర్సన్‌గా మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన డైరెక్టర్ మద్దికుంట రాధను మిగతా డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో డీసీఓ ఆదేశాల మేరకు మిగతా డైరెక్టర్లు రాధను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. గతంలో వైస్ చైర్మన్ బేజాడి సిద్దులపై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టగా ఆయన స్థానంలో రాధను ఎన్నుకున్నారు. అనంతరం రాధ మాట్లాడుతూ డైరెక్టర్లు అందరూ అంకిత భావంతో పని చేసి పీఏసీఎస్‌ను జిల్లాలోనే ఆదర్శంగా నిలుపాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని డైరెక్టర్లు, నూతన వైస్ చైర్మన్ రాధ కలువగా ఆమెకు ఎమ్మెల్సీ పల్లా శాలువా కప్పి సన్మానించి స్వీట్ తినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, డైరెక్టర్లు వేముల లక్ష్మణ్‌గౌడ్, సిద్దిని రాములు, గడిపె ప్రభాకర్, దాసారం శ్రీనివాస్,కానుగంటి బాలచందర్, నిమ్మ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోండి



గ్యారంటీ కార్డును అందిస్తున్న బాలకిషన్‌గౌడ్

బచ్చన్నపేట: అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అందుబాటులో ఉండే నాయకుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఆయన ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు కోడూరి మహాత్మాచారి, నాయకులు వేణువందన బుర్రా బాలమణి, సందెల రాము, శ్రీనివాస్,రాజిరెడ్డి, మోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మళ్లీ పాత రోజులు



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

● బీఆర్‌ఎస్ ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి

రఘునాథపల్లి: తప్పి దారి కాంగ్రెస్‌కు ఓటేస్తే .. మళ్లీ పాత రోజులు వస్తాయని, ఎన్నికల సమయంలో వారు చెప్పే మాయమాటలు విని మోసపోవద్దని ఎమ్మెల్సీ, స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం, కోడూర్, గబ్బెట, కన్నాయిపల్లి, గబ్బెట, మల్లంపల్లి, శివాజీనగర్, కంచనపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలకు వచ్చిన కడియంకు మహిళలు బతుకమ్మలు, మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. అయా గ్రామాల్లో కడియం మాట్లాడుతూ మీరు ఆశీర్వదించి గెలిపిస్తే ఐదేళ్ల పాటు సేవ చేసే అవకాశం ఇవ్వండని కోరారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కడియం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు మారుజోడు రాంబాబు, జెడ్పీటీసీ బొల్లం అజయ్, మండల అధ్యక్షుడు వారాల రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమార్‌గౌడ్, పోకల శివకుమార్, మల్కపురం లక్ష్మయ్య, నామాల బుచ్చయ్య, గవ్వాని నాగేశ్వర్ పాల్గొన్నారు.

'టైల్స్, మార్బుల్స్' ప్రత్యేక గుర్తింపు

చిల్పూరు: తాను ఎమ్మెల్యేగా గెలుపొందగానే నియోజకవర్గంలోని టైల్స్, మార్బుల్స్ అండ్ గ్రానైట్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ వారికి ప్రత్యేక గుర్తింపునిచ్చి అన్ని విధాల ఆదుకుంటానని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. గురువారం పార్టీ నాయకులు భూక్య సుధాకర్, అజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో యూనియన్ నియోజకవర్గం అధ్యక్షుడు గైరాజు సమక్షంలో 7 మండలాలకు చెందిన సంఘం అధ్యక్షులు, సభ్యులు కడియంను కలిసి శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ కడియం గెలుపునకు కృషి చేస్తామన్నారు.

అవినీతిలేని పాలన కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి



చిల్పూరు: మాట్లాడుతున్న ఇందిర

● కాంగ్రెస్ ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర

చిల్పూరు: అవినీతిలేని పాలన కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని శ్రీపతిపల్లి, లింగంపల్లి, కొండాపూర్, వెంకటాద్రిపేటల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధి అనుకున్న రీతిలో జరగాలంటే తనను ఎమ్మెల్యేగా గెలపించాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి పలువురు..

మండలంలోని తీగలతండాకు చెందినబీఆర్‌ఎస్ నాయకుడు తీగల మహేందర్ పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిర సమక్షంలో పార్టీలో చేరాడు. పల్లగుట్టలో వేల్పుల గట్టయ్య ను పరామర్శించారు. సమావేశాల్లో నాయకులు లింగాల సుబాష్‌చందర్‌రెడ్డి, పాశం సురేష్, యాదవరెడ్డి, మర్రి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

జఫర్‌గఢ్: కాంగ్రెస్ అభ్యర్థి ఇందిరను గెలిపించాలని ఉప్పుగల్లులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోరెడ్డి సత్యనారాయణరెడ్డి, గంగాదరి యాదగిరి, కొడాలి సాంబరాజు, జైపాల్‌రెడ్డి, లెంకల రాజు, వడ్లకొండ మధు, బత్తిని సత్యనారాయణ, రత్నం, అమిత్‌భాష పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి మోత్కుపల్లి ఆగయ్య, టీడీపీ నాయకుడు ప్యాట ముత్తయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మంద సత్తిరెడ్డి, కేమిడి రాములు, బొట్ల సుధాకర్‌లు గురువారం కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

'దగా చేసిన బీజేపీకి రాజీనామా చేస్తున్నా..'



మాట్లాడుతున్న మాదాసు వెంకటేష్

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో బీజేపీ అభ్యున్నతి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశానని, పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన తనకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ అధిష్ఠానం మోసం చేసిందని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు లేనందున బీజేపీకి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి పదవికి రాజీనామా చేస్తున్నానని మాదాసు వెంకటేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయం అంటే ఉద్యోగం కాదని, సామాజిక బాధ్యత అని, నిరుపేదల అభ్యున్నతి కోసం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. రాష్ట్ర పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా విజయవంతం చేసేలా జనసమీకరణ, వాహనాలు తదితరాల కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేశానన్నారు. చివరకు పార్టీని, కార్యకర్తలను ఏనాడు పట్టించుకోని జీవీఆర్‌కు టికెట్ ఇచ్చారని, కష్టపడి పనిచేసేవారికి సరైన గుర్తింపు లేనందున పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తదుపరి రాజకీయ కార్యాచరణ రెండు రోజుల్లో ప్రకటిస్తానని తెలిపారు. కాగా, మాదాసు వెంకటేష్ రాజీనామాతో ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీకి తీవ్ర నష్టం జరుగుతుందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఏదునూరి నాగరాజు, లింగాల ఆదిత్య, కనకం ప్రవీన్, మహేందర్, రవీందర్, సంపత్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, త్రిశూల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అవినీతి పాలన అంతం బీజేపీతోనే సాధ్యం

● బీజేపీ పాలకుర్తి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న రామ్మోహన్‌రెడ్డి

కొడకండ్ల: రాష్ట్రంలో నియంత, కుటుంబ అవినీతి పాలన అంతం చేయడం బీజేపీతోనే సాధ్యమని పాలకుర్తి బీజేపీ అభ్యర్థి లేగ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రంగాపురం, నర్సింగాపురం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావు చేసింది శూన్యమని, సంక్షేమ పథకాలను అర్హులకు కేటాయించకుండా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకే కేటాయించారని, పదిహేనేళ్లుగా మభ్యపెడుతూ కాలం వెల్లబుచ్చడం తప్ప చేసింది శూన్యమని, రాబోవు ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. స్థానికున్ని అయిన తనను ఆదరించి గెలిపిస్తే అందుబాటులో ఉంటూ ఐదేళ్లు సేవ చేస్తానని అన్నారు. బీజేపీ నాయకులు కోటేశ్వర్ రావు, మోడపల్లి సోమన్న, ఉపేందర్, రాజశేఖర్ గౌడ్, శ్రీనివాస్, సాయి, రాములు, పవన్‌రెడ్డి, కన్నయ్య, నాగయ్య, రమేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

బచ్చన్నపేట: పీఎం నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పలు పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో బూత్ కమిటీలను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొప్పలు చెబుతుందన్నారు. అభివృద్ధిని విస్మరించిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రవీంద్రాచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పూర్వ వైభవానికి పాటుపడాలి



యూత్ కమిటీ ప్రతినిధులు

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కోసం పాటుపడాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పారుపెల్లి శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని మున్‌పహాడ్‌లో కాంగ్రెస్ యువజన కమిటీ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల కృష్ణ, ఉపాధ్యక్షుడిగా చీకటి సంపత్, కార్యదర్శిగా కడియం అర్జున్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టి కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జోగు యాకన్న, మాజీ సర్పంచ్ జోగు మల్లయ్య, సీనియర్ నాయకులు చీకటి యాకన్న, శేఖర్, దావుల యాకన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడికి మాతృవియోగం



కౌసల్య (ఫైల్)

దేవరుప్పుల: సింగరాజుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు మాతృమూర్తి కౌసల్య(75) గురువారం రాత్రి పరమపదించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆంజనేయులుతోపాటు గ్రామీణ వైద్యుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు మేకపోతుల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు మేకపోతుల రవీందర్‌ను మంత్రి పరామర్శించారు. వైస్‌ఎంపీపీ విజయకుమార్ రెడ్డి ,సర్పంచ్ గోపాల్ దాస్ మల్లేష్, రమేష్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి

దేవరుప్పుల: ఈ నెల 11న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం తలపెట్టిన విశ్వరూప మహాసభను రాజకీయాలకతీతంతగా ఎస్సీ సామాజివర్గం అత్యధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సింగరాజుపల్లిలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మందకృష్ణమాదిగ నేతృత్వంలో కొనసాగిన వర్గీకరణ సాధన ఉద్యమంతోనే ఆత్మగౌరవం లభించిందని, ఈ స్ఫూర్తితోనే పాలకవర్గాలు వర్గీకరణ అమలు చేస్తే ఆర్థిక, అసమానతల తొలిగి పలు వర్గాల కుటుంబాల్లో పేదరికం తొలిగిపోతుందన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని నల్లకుంటతండా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బానోత్ మోహన్ తల్లి బానోత్ మాల్కి(55)మృతి చెందింది. కాగా గురువారం టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు.

శ్రీహరికి మాదిగల మద్దతు

జఫర్‌గఢ్: కడియం శ్రీహరికి మాదిగలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మాదిగ రాజకీయ సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదెపాక నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికాయల చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన మాదిగ రాజకీయ సమితి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కడియం శ్రీహరి గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

రఘునాథపల్లి: డ్రంకెన్‌డ్రైవ్‌లో మండలంలోని కోమళ్ల గ్రామానికి చెందిన బంద అజయ్‌కు గురువారం జనగామ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ 1,000 జరిమానా విధించినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడుపొద్దని ఆయన సూచించారు.